

# ఋణానుబంధం

సి. కనకాంబరరాజు

'ఇంకేం చూస్తావ్‌లే మామ్మా...పొద్దు పోవచ్చింది, ఇంటికెళ్ళిపో...!వస్తే అతనే వస్తాడులే...ఇంకెంత సేపని ఎదురు చూస్తావ్...?'

—అన్నాడు రమణయ్య పొలంనుంచి తిరిగి యింటికి వెళ్ళిపోతూ. పొద్దున్న పొలానికి వెళ్లేటప్పుడు చూశాడు, రత్తమ్మ అక్కడ కూర్చోవడం. సాయంత్రం అయిపోయింది చీకటి పడిపోవస్తున్నది. అయినా రత్తమ్మ అలాగే కూర్చుండిపోయింది.

'ఇంటికి వెళ్ళిమాత్రం చేసేదేముంది? ఇంకాస్సేపు కూర్చుంటాలే బాబూ... నువ్వెళ్ళు...' అంది రత్తమ్మ. అనేసి, లోలోపల అనుకుంది—'పిల్లాపాపాలేని రమణయ్యకి ఏం తెలుసు – కన్నతల్లి ప్రాణం...?'

బస్సులు వస్తున్నాయి. వెళ్తున్నాయి. దుమ్ములేపుకుంటూ ఆగకుండా వెళ్ళిపోయే బస్సులని తదేకంగాచూస్తూ—ఆగిన బస్సులోనుంచి దిగే మనుషుల వంక కళ్ళప్పగించి చూస్తూ – ఆశగా అలాగే కూర్చుండిపోయింది రత్తమ్మ.

చిన్నప్పుడెప్పుడో వెళ్ళిపోయాడు రావుడు. ఎలిమెంటరీ స్కూల్లో చదువు

తుండగా ఇల్లు వదిలిపెట్టేసి వెళ్ళి పోయాడు.

బడి ఎగ్గొట్టి అల్లరిమూకతో కలిసి చీట్లపేక ఆడుతున్నాడని తెలిసి తండ్రి చావచితకమోదాడు. ఆ దెబ్బతో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు.

చెప్పి వెళ్ళివుంటే దాచుకున్న డబ్బు ఇచ్చి పంపేదాన్నే - దారిలో తిండానికి ఏమన్నా చేసిపెట్టేదాన్నే-ఎక్కడకి వెళ్తున్నాడో చెబితే తెలిసివున్నవాళ్ళ అడ్రసులు ఇచ్చేదాన్నే_అని కుమిలిపోయింది రత్తమ్మ.

రావుడు వెళ్ళిపోయినప్పటి సంఘటన ఆమె కళ్ళముందు మెదిలి కళ్ళు చెమర్చాయి. '—నా పిచ్చికాకపోతే ఆనాడు నాకు తెలిసివుంటే అసలు వెళ్ళనిచ్చేదాన్నా...?'-అని నిట్టూర్చింది.

వెళ్ళనివ్వకపోతే రావుడు ఇంత గొప్పవాడు అయ్యేవాడా? ఇక్కడ-ఈ వూళ్ళో ఏముంది? మట్టి! వుత్తి దుమ్మూ ధూళీ...! అప్పుడు అలా ఇంట్లోంచి వెళ్లిపోయాడు గనకనే ఇప్పుడు రాజులా తిరిగి వస్తున్నాడు. ఫలానావారి కొడుకు అని అంతా చెప్పుకుంటుంటే గర్వించతగ్గ రావుడుగా తిరిగి వస్తున్నాడు...

కలెక్టరు వుద్యోగం అంటే మాటలా? మహామహావాళ్ళకే రాదు...-!

—కలెక్టరు వుద్యోగం చేస్తున్నాను.. ఇంటికి వస్తున్నాను... ఇక ఇంటిదగ్గరే వుండిపోతాను... నీ కేకష్టం రాకుండా చూసుకుంటాను... మనందరికీ మంచి రోజులు వచ్చాయి. బోల్డంత డబ్బు తెస్తున్నాను... మనవూరంతా కొనేస్తాను ...అని రాసేడు రావుడు.

పిచ్చిసన్నాసి...ఇవన్నీ నాకెందుకు? నా కొడుకు నా కళ్ళముందు కదులుతూ వుంటే ఎన్ని సంపదలయినా వాడిముందు దిగదుడుపే...!

ఎక్కడున్నాడో...ఏంచేస్తున్నాడో.. అసలు వున్నాడోలేడో...అనుకున్నవాడు ఈ రోజు కలెక్టరై తిరిగి వస్తున్నాడు... ఎంత అదృష్టం...?ఎంత అదృష్టం...?

కలెక్టరయిన కొడుకును కళ్ళారా చూసుకోడానికి ఎన్నిరోజులు పడిగాపులు పడివుంటేమాత్రం తప్పేమిటి?

కన్నకొడుకు మీద మమకారం ఎలాంటిదో రమణయ్యకు తెలియదు. కలెక్టరంటే ఎంతగొప్పో వూళ్లో జనానికి తెలియదు. అంతా వెర్రిమూక. చెప్పినా అర్థంకాదు.

వూళ్లో కరణంగారూ, మునసవుగారూ బస్తీకి వెళ్ళిపోయారు. లేకపోతే తెలిసేది...ఎంత అట్టహాసం చేసేసేవారో... ఎంత హడావుడి పడిపోయేవారో...?

నిజమే..

ఆ పాలెము ప్రజలకి అక్షరజ్ఞానం కొంచెంకూడా లేదు. ఎంతసేపూ గొడ్డుల్లా చాకిరీచెయ్యడం తప్పించి రెండో వ్యాపకంలేదు. ఆ జనం జనంకిందా_ఆ వూరు వూరికిందా లెక్కలోకి రాదు.

జనాభాలెక్కల్లో ఆ వూరు కలిసిందంటే అదో గొప్ప విషయం.

ఆ వూరికి వెళ్ళాలంటే చిన్న వాగు దాటాలి రెండు మూడు పంటకాలువలు దాటాలి చేలగట్లు అడ్డబడి నడవాలి పుంతలూబురదలూ తొక్కాలి అప్పుడు ఆ వూరికి వచ్చినట్టు

ఇంత కష్టపడి ఆ వూరికి వచ్చేవోపిక ఆ వూళ్ళో ఆ కొద్దిమందికి మాత్రమే వుంటుంది

స్కూలుకు వెళ్ళాలంటే పొరుగూరికి వెళ్ళాలి సంతకి వెళ్ళాలంటే పొరుగూరికి వెళ్ళాలి ప్రతి చిన్న విషయానికీ పొరుగూరిమీద ఆధారపడిన ఆ జనానికి రత్తమ్మ కొడుకు సంగతీ–అతని గొప్ప సంగతీ తెలిసివున్నా – ఏంచెయ్యాలో వాళ్లకి తెలియదు వట్టి అనాగరికులు చదువు సంధ్యల్లేని మొద్దు రాచ్చిప్పలు

"మా రావుడు కలెట్టరై వస్తున్నాడురా...అంటే నూకాలు ఏవన్నాడు 'వచ్చింతర్వాత కవురెట్టు సూడ్డాని కొత్తాను 'అన్నాడు వూళ్లోకి పెద్దమనిషి ఎంకమ్మపాటి తెలీదు

పొద్దున్నే వస్తుంటే ఎంకమ్మ ఏమంది .."మీరావుడు కలెక్ట్రు అయ్యాడంటగా కల్ట్రు అంటే గవర్నరుతో సమానమంట కార్లో వస్తున్నారా...యిమానంలోనా...?" అంది

'బస్సులోనమ్మా...' అంటే బుగ్గన వేలేసుకుంది

'నా కొడుకు సంగతి దీనికేంతెల్సు ? కలెట్టరయినంతమాత్రాన కార్లో కూర్చుని కళ్లెగరేసే పోకిరీవా డనుకుంటుంది కాబోలు. వాడిది వాళ్ళ నాన్న పోలిక ఆ మగమహారాజు వుంటే ఎంత పొంగిపోయేవాడో వచ్చేరాంగానే నాన్నేడీ అంటే ఏంచెప్పను . ?'

అనుకుంటూనే ఆమె కళ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి చెంగు లాక్కుని నోట్లో కుక్కుకుంది

ఇంతలో ఏదో బస్సు వచ్చి ఆగింది ఒక్కడంటే ఒక్కడే దిగాడు అతను ఈరాసామి


ఏంది మామ్మా ఇక్కడ గూకున్నావ్ యారన్నా వొత్తున్నారా...? అనడిగాడు

'మరేరా...రావు దొత్తున్నాడు...' అంది రత్తమ్మ

'ఏందేందీ...రావుడా?... నీకేమన్నా మతివోయిందా?' అన్నాడు ఈరాసామి అనుమానంగా

'రావడంలో ఏందనుకున్నావ్ ..కలెట్టరయి వత్తున్నాడు. ఆ(...' అంది ముఖం చాటంతచేసుకుని

ఈరాసామి అనుమానం నిజమయింది 'ఇంత సందెవేళ వొంటరిగా కూకుంది ఏనాడో సచ్చివోయాడనుకున్న కొడుకు వొత్తున్నాడంటుంది పైగా ఆడు కలెట్టరయ్యాడంట . కలెట్టరు. పిచ్చిమాలోకం...ఈ రత్తమ్మకి మొగుడు పోయి




నప్పటినుంచి తెలివి చెదిరిపోయింది...' అనుకుంటూ చరచరా అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆకలి దప్పులు మరచి ఎదురు చూస్తున్నది రత్తమ్మ. రాత్రయిపోయింది. చుట్టూ చీకటి రోడ్డు ఇరువైపులా వున్న మర్రిచెట్లు జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లా కనిపిస్తున్నాయి. ఎక్కడా జన సంచారంలేదు.

ఇంక బస్సులున్నాయో లేవో అన్న ఆలోచనలేదు రత్తమ్మకి. తన కొడుకు కలెక్టరు. బస్సు లేకపోయినా వేయించుకు రాగల సమర్థుడు - అని ఎదురు చూస్తూ కూర్చుంది.

చూపు కనిపించేమేరకు రోడ్డుమీదకు దృష్టిసారించి కళ్లు కాయలుకాచేలా ఎదురు చూస్తున్నది.

ఆ చీకట్లో - దూరంగా- రోడ్డుమీద కొరివిదెయ్యాలు జంటగా రయ్యిమనివస్తున్నట్టుగా కనిపించింది.

సందేహంలేదు. ఆ దెయ్యాలు బస్సుకు సంబంధించిన లైట్లే.

బస్సు వచ్చేస్తున్నది. బస్సులో రావుడు వచ్చేస్తున్నాడు. వచ్చీరాంగానే తన్ను 'అమ్మా' అంటూ గట్టిగా కావలించుకుంటాడు. దాంతో-ఇంత సేపూ పడిన మనోవ్యథ అంతా చెల్లాచెదురైపోతుంది.

ఇంతకీ, తనని గుర్తుపడతాడో లేదో?

రావుడు మాట దేవుడెరుగు-తనుగుర్తుపట్టగలుగుతుందా అని ?

ఎప్పుడో చిన్నప్పుడు లాగులు నాడు చూసింది. ఇపుడు దొరబాబులా అయి వుంటాడు. సూటూబూటూ వేసుకుని అచ్చం దొరబాబులా వుంటాడు. ఎందుకు గుర్తుపట్టలేదు తను?అలాంటివాడు ప్రపం

చంలో ఎక్కడా వుండడు ఉన్నవాళ్లం దరిలోకి తనకొడుకే గొప్పవాడు అంత గొప్పవాడిని తను గుర్తించలేక పోతుందా? ఛ.ఛ.. ఎప్పటికీ కాదు...

రత్తమ్మ ఆలోచనలు ఇలా సాగు తూండగానే వచ్చి ఆగింది బస్సు.

ఆగిందీ అంటే ఎవరో దిగుతారనే అర్థం. ఆ ఎవరో ఎవరోకాదు. తన కొడుకే...రావుడు...తన రావుడు.

బస్సు దిగాడు.

అంత చీకట్లోనూ ఇక్కడ దిగిన వాడు తన రావుడు కాకపోతే ఎవరె వుంటారు?

దిగిన మనిషిని వదిలి దుమ్ములేపు కుంటూ కదిలిపోయింది బస్సు. పక్కగా నిలబడ్డ రత్తమ్మ గుండెల్లోదాకా పోయిన దుమ్ము ఆమెని వుక్కిరిబిక్కిరి చేసేసింది. దగ్గుతూ వూపిరి సలపకుండా ఆప సోపాలు పడుతున్న రత్తమ్మ పరిస్థితి - ఆమె వునికిని తెలియపర్చింది బస్సు దిగినవాడికి...రత్తమ్మగారి రావుడికి...

అటూఇటూ చూస్తున్న రావుడు రత్త మ్మని పసిగట్టాడు. ఆ చీకట్లో ఆడో మగో తెలియలేదుగాని-మొత్తంమీద ఒక మనిషి అతనికి అందుబాటులో వున్నట్టు గ్రహించాడు.

చేతిలోవున్న బరువైన హోల్డాలు ఆమెమీదకి గిరాటువేశాడు. ఎదురుసమా ధానంకోసం ఆశించకుండా నడక సాగిం చాడు.

ఈ ఆకస్మిక సంఘటన రత్తమ్మని ఎంతగా కలచివేసిందో-ఆమెలో ఎలాంటి సంచలనాన్ని లేపిందో తెలిసేందుకు అది పగలుకాదు, రాత్రి వెలుగులేదు, చీకటి. కటికిచీకటి.

రత్తమ్మ బదులు చెప్పలేకపోయింది. హోల్డాలు పట్టుకుని నడవబోయింది. అది చాలా బరువుగావుంది. చేతులతో మోసు కెళ్లే శక్తి ఆమెకు లేదు. ప్రొద్దుటనుంచి అన్నపానీయాల్లేకుండా అతనికోసం నిరీ క్షిస్తూవుంది. అయినా ఆమెకి నిస్సత్తు వగా లేదు. కాని, రావుడు తన్ను పలక రించలేదు తను ఆశించినట్టు కావలిం చుకోలేదు. 'అమ్మా' అని నోరెత్తి పిలవ లేదు-ఇవన్నీ ఆమెకి ఆశాభంగాన్ని కలి గించాయి.

శారీరకంగా ఎంతటిబాధనైనా భరించ గలదు గాని, ఈ గుండెపోటును భరించ లేకపోయింది. హోల్డాలు చేతికి తీసుకుని రెండడుగులు వెయ్యగానే తూలి పడ బోయింది.

రావుడు నడుస్తున్నాడు. చకచకా నడుస్తున్నాడు. ఈ ప్రపంచంతో సంబం ధము లేనట్టుగా నడుస్తున్నాడు. హుందాగా ఠీవిగా బూట్లు టకటకలాడిస్తూ రోడ్డుమీద రత్తమ్మకంటి జ్యోతిలా వెలిగి పోతున్నాడు. అతను వేసుకున్న బూట్లు కొత్తవేమో...పాలిష్ అప్పుడే చేయించా డేమో టార్చిలైట్లల్లా మెరుస్తున్నాయి. సూటు వేసుకున్నాడులా వుంది-మనిషి

మనిషిలా లేడు. రత్తమ్మ కంటికి ఇంద్రుడూ చంద్రుడులా కనిపిస్తున్నాడు.

ఈ రావుడు తన కొడుకు. తన కొడుకే. తనకోసమే వస్తున్నాడు-రత్తమ్మ ఇలా అనుకోగానే ఆమె బాధ అంతా పటాపంచలైపోయింది. అతన్ని చూస్తూనే అన్నీ మరచిపోయింది. మనసు తేలిక పడ్డది.

ఉత్సాహంగా హోల్డాలు తలపైకి విసురుకుంది. హోల్డాలు ఆమె తలమీద కుదురుగా కూర్చుంది. తలమీద బరువులు మొయ్యడం ఆమెకి అలవాటులేదు. అయినా బరువుగా వున్న ఆ హోల్డాల్ ఆమెకి బరువనిపించలేదు.. చిత్రం!

రావుడు నడుస్తున్నాడు.

రత్తమ్మ హుషారుగా రావుడు వెనకాలే పరుగెడుతున్నట్టుగా నడుస్తున్నది..

రావుడు నడుస్తున్నాడు.

బూట్ల టకటకలు అతన్ని వుత్సాహపరుస్తున్నట్టుగా వున్నాయి. వడివడిగా నడుస్తున్నాడు నడకవేగం హెచ్చిస్తున్నాడు.

రత్తమ్మ పరుగెత్తుతుంది. వెర్రిఆలోచనలతో-అపరిమితానందంతో-తనకొడుకు తన దగ్గరికి వచ్చేస్తున్నాడన్న సంబరంతో అతని వెనకాలే పరుగెత్తుతున్నది.

రావుడు నడుస్తున్నాడు. ఆ నడకలో ఏదో తడబాటు. దారితెలియని వెతుకులాట. అందులో మళ్ళీ ఎక్కడలేని ఠీవి.

ఇంత దర్జాగావున్న కొడుకుని తన పూరిగుడిసెలోకి ఎలాగ తీసుకువెళ్లాలి? అన్న ఆలోచన కలిగింది రత్తమ్మకి.

పోనీ మునసబుగారి పెంకుటింటికి తీసుకువెళ్తేనో? అనుకుంది. అవును, అలా చేస్తేనే బాగుంటుంది - అని నిర్ణయించుకుంది. ఇంత గొప్పవాడిని పూరిగుడిసెలో వుంచితే తనకే తలవంపులుగా ఉంటుంది. మునసబుగారి పెంకుటిల్లే తగిన ఇల్లు.

కొడుకు కలెక్టరై తిరిగివస్తున్న సమయానికి తను కనీసం ఒక డాబాయింటినైనా అమర్చిపెట్టుకోలేని అసమర్థతకి ఆడిపోసుకుంది.

రావుడు రోడ్డు మలుపు తిరుగుతున్నాడు. ఇంకా చాలాదూరం నడవాలి. అంతదూరం నడవగల్గుతాడోలేదో-అసలే అది వెధవపుంత. అన్నీ ముళ్ళడొంకలే.

ఎత్తుకు తీసుకువెళ్ళితే......? ఈ హోల్డాలు ఒకటీ...! ఇది లేకపోతే... ఎత్తుకు తీసుకువెళ్ళగలిగేదా తను...;

రత్తమ్మ పెదవులమీదికి చిరునవ్వు చిందులాడింది. తప్పకుండా ఎత్తుకుతీసుకెళ్లేదే. రావుడు ఎంత గొప్పవాడైనా ఆ గొప్ప పరాయివాళ్ళకి. రావుడు తనకి కొడుకు, తనకి తన కొడుకెప్పుడూ చిన్న పిల్లవాడే...

వెధవ్వూరు. కనీసం బండయినా వెళ్ళదు, బండికూడా వెళ్ళని ఆ వూరిని

తిట్టిపోసింది రత్తమ్మ రోడ్డని దుమ్మెత్తి పోసింది ఒకవేళ రోడ్డు బాగున్నా — అతన్ని కనీసం - ఒక కారుమీదయినా యింటికి తీసుకువెళ్లలేని తన దీనావస్థకి ఎంతగానో నొచ్చుకుంది.

రావుడు నడుస్తున్నాడు. ఏమిటలా నడుస్తున్నాడు...? తాగాడా ? ఛఛ... తాగితే మాత్రం ఏం...? కూలిపని చేసుకునే నాగన్నే తాగుతున్నాడు...కలెక్టరయినవాడు తాగితే మాత్రం ఏం...?

ఇంకా చాలాదూరం నడవాలి. ఎలా నడుస్తాడో ఏమో...! అనలు నడవటం అలవాటుందోలేదో...? ఇంటికెళ్ళిన తరవాత కాళ్ళుపట్టాలి. అరికాళ్లకి ఆముదం పట్టించి మర్దన చెయ్యాలి. ఎంత బూటు వేసుకుంటేమాత్రం? కాళ్ళు నొప్పి పుట్టవూ? కాళ్ళు నలిగిపోవూ...?

కంటికి రెప్పలాంటి ఆ తల్లి-రావుడు గురించి పడే మనోవేదన వర్ణనాతీతం.

చెప్పులయినా లేని ఆమె పాదంలో తుమ్మముల్లు కసుక్కుమని దూసుకుపోవడంతో ఆమె ఆలోచనలు కట్టడిపోయాయి.

బాధతోకూడిన చిన్న మూలుగుతో ఆమె నడక కుంటువడింది.

హోల్డాలు కిందపెట్టి కాలుముల్లు తీసుకుందామా? అని క్షణమాత్రం అనుకుంది. హోల్డాలు కింద పారేస్తే మట్టి అంటుకోవచ్చు. రావుడు దీన్ని ఎంత అపురూపంగా చూసుకుంటున్నాడో ఏమో —హోల్డాలు కిందకిదింపడం ఆమెకిష్టం లేదు

రావుణ్ని చూసింది. తనకి చాలా దూరంలో వున్నాడు. చకచకా నడిచి వెళ్ళిపోతున్నాడు. లక్ష్యంచూసి విడిచిపెట్టిన బాణంలా వెళ్ళిపోతున్నాడు.


ఆ ఆదుర్దా అంతా ఎవరికోసం? తనకోసం? తనకోసమా! తనని చూడ్డానికా ఆ తొందరంతా. పాపం. ఎంతగా అలమటించి పోతున్నాడో, ఏమో!

'పిచ్చి మొద్దును, బస్సు దిగంగానే నేనే నీ తల్లినిరా అని చెప్పేస్తే నాకే అవస్థా వుండేది కాదు...?' అనుకుంది

తనకోసం అంత ఆదుర్దా పడుతూ వెళ్తున్న వాడికి తనవల్ల ఆలస్యమైతే ఎంత బాధపడతాడు? అని బాధపడింది.

కాల్లో దిగినముల్లు నడుస్తుంటే కసుక్కున కదులుతున్నది. విపరీతమైనబాధ పెడుతన్నది. ఆ ముల్లు తీసుకుంటూ కూర్చుంటే — కొడుకు దూరమైపోతాడేమో! ఇంటికి చేరుకునేసరికి అక్కడ తను వెంటనే కనిపించకపోతే బెంబేలు పడిపోతాడేమో - అని అలాగే పరుగు సాగించింది రత్తమ్మ.

దూరంగా నడుస్తున్న అతన్ని చూస్తుంటే ఆమెకి ముల్లు గుచ్చుకున్నట్టుగా కాని, అది సలుపుతున్నట్టుగా గాని అనిపిచడంలేదు. అసలు భూమ్మీద నడుస్తున్నట్టేలేదు. గాల్లో తేలిపోతున్నట్టుగా-హాయిగావుంది.




గబగబ నడిచివెళ్తున్న 'రావుడు' వూర్లోకి వచ్చేశాడు ఎటువెళ్ళాలా ? అని ఆలోచిస్తున్నట్టుగా కాసేపు ఆగాడు అక్కడ అతను కొంచెం తూలిపడినట్టుగా కూడా తోంచింది

రత్తమ్మ కాళ్ల వేగం హెచ్చింది కొద్ది అంగల్లో రావుణ్ణి చేరుకుని ఉండేదే అంతలో రావుడు నిలదొక్కుకొని కదిలి పోయాడు

వూరి పొలిమేరలకి దగ్గరగా వున్నది రత్తమ్మ పూరిగుడిసె పిచ్చితండ్రి నడవలేకపోతున్నాడో ఏమో... ! ఆ గుడిసెలోకే కాళ్లసాగించాడు

రత్తమ్మ హడావిడిగా గుడిసె చేరు కునేసరికి-రావుడు కాళ్లారజాపి నులక మంచంమీద వెల్లికితలా పడుకుని వున్నాడు సొమ్మసిలిపోయినట్టుగా పడిపోయాడు

రత్తమ్మకి కంగారు పుట్టింది రావు డికి ఏమయిందో అని ఆమె భయం గుడ్డిదీపం వెలిగించి, ముఖం దగ్గ రకి పట్టకెళ్ళి చూసింది అతను కళ్లు మూసుకుని వున్నాడు నిద్రపోతున్న ట్టుగా వున్నాడు

ఎప్పుడు తిన్నాడో ఏమో-?

కోటు బొత్తాములు విప్పి చొక్కా మీద చెయ్యివేసి కడుపు తడిమింది అది బాగా లోతుకుపోయివుంది

ఆమె కళ్లనుంచి బొటబొటా రాలాయి కన్నీళ్లు వేసిన చెయ్యి తియ్యలేదు తియ్యాలని అనిపించ లేదు అతని స్పర్శ ఆమెకి వింత అనుభూతిని కలిగించింది స్వర్గంలో ఉన్నట్టు అనిపించింది చెయ్యి తియ్యకుండానే తల ఆనించింది, అతని గుండెలమీద

'ఇలా నా ప్రాణాలు ఎగిరిపోతే ఎంత బాగుండును !' అనుకుంది

అలా అనుకుంటుండగానే ఆమె చెంపలకి ఏదో చల్లగా తగిలినట్టు అని పించి వులిక్కిపడింది

'నా తండ్రికి ఎంత చెమట పట్టింది?'- అనుకుంటూ దీపంవత్తి పెద్దదిచేసి దగ్గరగా పట్టిచూసింది.

అది చెమటకాదు.

రక్తం—!.

తడితడిగా పొడిపొడిగా వున్న రక్తం...!

కెవ్వున అరచింది రత్తమ్మ. గుండెలు పగిలిపోయేలా - రక్తనాళాలు తెగిపోయేలా అరించింది రత్తమ్మ.

పక్కనే రావిచెట్టుకు వేలాడుతూ నిద్రపోతున్న వెన్నముద్దలు కీచుకీచు మంటూ ఎగిరిపోయాయి.

వూళ్లో జనమంతా పరుగెత్తుకొచ్చారు. గుడిసెలోకి వెళ్లి చూశారు. మరు క్షణంలో గుడిసె చుట్టూ జనం గోల...!

ఒక్కొక్కరూ ఒకో రకంగా చెప్పుకుంటున్నారు వింతగా అనుకుంటున్నారు.

తెల్లారు ఝాము అవుతూ వుండగా యిద్దరికీ దహన సంస్కారాలు చేసే ప్రయత్నం ఆరంభించారు.

అదే సమయంలో దూరంనుంచి కుక్కల అరుపులు వినిపించాయి. మామూలు కుక్కలు అరిచినట్టుగాలేదు. వింతగా అరుస్తున్నాయి.

జనంలో కొంతమంది ధైర్యం వున్న వాళ్లు అటువేపు వెళ్లారు,

భయంకరంగా అరుచుకుంటూ వస్తున్న రెండు కుక్కలు కనిపించాయి. మరి కొంత దూరంలో పోలీసులు కనిపించారు.

ఆ వూరికి కనీవిని ఎరగని సంఘటన ఇది!

కుక్కలు. పోలీసులు. పోలీసులు-కుక్కలు. పోలీసుకుక్కలు!

గ్రామస్థులు భయకంపితులై పోయారు. రత్తమ్మ యింటిచుట్టూ వున్న జనం పలాయనం చిత్తగించారు. ఎవరి ఇళ్లల్లో వాళ్లు దూరి తలుపులు గట్టిగా బిడాయించుకున్నారు. కిటికీ చువ్వల్లో నుంచి ఏం జరుగుతున్నదీ చూస్తున్నారు.

మరి కొంతమంది ధైర్యం చేసి పొదల మాటునా-డొంకల మాటునా వుండి పొంచిపొంచి చూస్తున్నారు.

కుక్కలు సరిగ్గా రత్తమ్మ గుడిసెలోకి దూరాయి. ఆ వెంటనే పోలీసులూ దూరారు.

కుక్కల అరుపులు నెమ్మదిగా తగ్గిపోయాయి.

పోలీసులు గుడిసె పీకి పందిరేశారు. వాళ్లకి కావలసింది మరోటి ఏదో వుంది. కాని, చిక్కినట్టులేదు.

తెల్లారుతూ వుండగా రత్తమ్మనీ-హతుడ్నీ వూరినుంచి తరలించేశారు.

జనంలో అలజడిరేగింది. ఆ సంఘటన గురించి కథలు చెప్పుకోవడమే పని. వాళ్లవాళ్ల కల్పనాశక్తిని బట్టి కథల్లుకుపోతున్నారు.

రత్తమ్మ కొడుకు దొంగ. పచ్చి




దొంగ. పోలీసులు వెతుక్కుంటూ వచ్చారు. వాళ్ళకి దక్కకుండా పారిపోవడం మూలాన్నే తుపాకీ పేల్చివుంటారు. అది గుండెల్లో దాకా గుచ్చుకుపోయింది. చావుతప్పి ఇలా పరుగెత్తుకొచ్చాడు. రత్తమ్మ గుడిసెలో ప్రాణాలు వదిలాడు. పాపం, రత్తమ్మ పిచ్చిది. కొడుకును ఆ స్థితిలోచూసి ప్రాణాలు వదిలేసింది. కొడుకు దొంగాడని తెలుసుకోకుండానే ప్రాణాలు వదిలేసింది రత్తమ్మ. ఆమె అదృష్టవంతురాలు.

—తలొకరూ తలొకమాటా అనుకుంటుండగా ఆ వూరికి మళ్ళీ ఒక కొత్త మనిషి వచ్చాడు కొత్తసమస్య తెచ్చాడు. వచ్చీరాగానే "మా అమ్మ ఏదీ?"—అనడిగాడు.

'మీ అమ్మ ఎవరు?'

'రత్తమ్మ'

'నువ్వెవరు?'

'రావుణ్ని'

"రావుడివా? సిత్రంగావుందే. మరి రాత్రివచ్చినోడో...?"

'నేను కాను. బస్సు దొరకలేదు. నా బెడ్డింగు ఎవరో కొట్టేశారు. ఆలస్యమైపోయింది. మా అమ్మ ఏదీ?'

ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

అక్కడున్నవాళ్ళు ఒక్కొక్కరే జారిపోసాగారు, ఏదో తప్పుచేసినవాళ్లలా. రావుడి ప్రశ్నకి సమాధానం చెప్పినవాళ్ళెవరూ కనిపించలేదు

ఒకడ్ని నిలేసి అడిగాడు రావుడు.

అతను జరిగిందంతా చెప్పాడు

రావుడి కిదంతా అగమ్యగోచరంగా వుంది. గుడిసెలోపలికి పరుగెత్తిచూశాడు. లోపలంతా కలియతిప్పేసినట్టుగా వుంది. చిందరవందరగా వుంది

ఒకమూలనడున్న హోల్డాలు అతని కంట పడింది

ఆ హోల్డాలు తనదే. అవును తనదే!

ఒక పొర కోసి చూశాడు. బంగారు రేకులు తళతళా మెరిశాయి. కరెన్సీ కూడా చెక్కుచెదరలేదు. దాన్ని మళ్ళీ అలాగే వుంచేశాడు.

అయితే వాడేనన్నమాట... !

తనదగ్గర హోల్డాలు తస్కరించిన వాడే అయివుంటాడు. సరయిన చోటికే తీసుకు వచ్చాడు.

ఏం లాభం? తల్లి ప్రాణాలు తీసేశాడు. ఎవరికోసమయితే తను ఇంత కష్టపడి సంపాదించుకువచ్చాడో-- ? ఆ కష్టమంతా బూడిదపాలయిపోయింది.

అమ్మ ఇకలేదు !

ఈ సంపదతో ఎంతో చెయ్యాలనుకున్నాడు. తల్లిని అందలాలెక్కించి ఆనందాలు చూపించాలనుకున్నాడు.

ఆమె కష్టాలు గట్టెక్కించి స్వర్గ సుఖాలు చూపించాలనుకున్నాడు--

అదే వుద్దేశంతో వస్తుండగా హోల్డాలు మారిపోయింది. ఎవరో కావాలనే ఇలా చేశారు. తనని వెంటాడినవాళ్లే దీనికంతా కారణం. అమ్మదగ్గరికి వచ్చే ఘడియలు దగ్గర పడుతూపడుతూ వుండగా--- హోల్డాలు మాయమైపోయింది. తన సర్వస్వం దోచేసుకున్నారు. తన ఆశలు కూలిపోయాయి.

అమ్మని సుఖపెట్టేరాత ఇక నాకు లేదు అనుకున్నాడు.

కాని... కాని... మళ్లీ అయిశ్వర్యం లభించింది. అమ్మ లేదు. అయిశ్వర్యం లేకపోయినా ఫరవాలేక పోయేది-- అమ్మవుంటే అంతా వున్నట్టే అనుకునేవాడు.

---రావుడు కృంగిపోయాడు. మోకాళ్లమీద కూర్చుని చేతుల్లో ముఖం దాచుకుని భోరుమన్నాడు.

ఎవరో లోపలికి వచ్చారు. తర్వాత ఒక్కొకరూ. అంతా అతని చుట్టూ మూగారు.

'మీరేనా కలెక్టరు ?'

'కాదు, బిల్లు కలెక్టరు. అదీ ఇప్పుడు కాదు; ఒకప్పుడు...' ఏడుస్తూనే సమాధానం ఇచ్చాడు

'ఎవరో దొంగవెధవ. రత్తమ్మ ప్రాణాలు పొట్టబెట్టుకున్నాడు...'-అన్నారెవరో...

ఎవరా దొంగవెధవ? --అనుకున్నాడు రావుడు మనసులో...

--స్మగ్లింగ్‌లో సంపాదించిన డబ్బుతో అమ్మని సుఖపెట్టాలనుకున్నాను. ఆడబ్బే అమ్మప్రాణాలు తీసింది. నేను పాపిష్టివాడిని... పాపం డబ్బుతో అమ్మ ప్రాణాలు తీశాను. ఈ డబ్బుతో సుఖపడ్డం ఇష్టంలేకనే అమ్మ వెళ్ళిపోయింది. ఈ డబ్బు లేకపోతే అమ్మ బ్రతికే వుండేదేమో...

'అమ్మా' అంటూ భోరుమన్నాడు రావుడు, రత్తమ్మకొడుకు !.

---